# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 6వ తేదీ నుండి ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో పర్యటించనున్నారు.

❖ దేశీయ ఎగుమతులను ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

❖ సింధు జలాల ఒప్పందంపై భారత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

❖ 16వ ఆర్థిక సంఘం పంచాయతీలకు 80 శాతం ప్రాథమిక గ్రాంట్లు, 20 శాతం పనితీరు ఆధారిత గ్రాంట్లను ప్రతిపాదించినట్లు కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించారు.

❖ అమర్‌నాథ్ వార్షిక పవిత్ర యాత్ర అధికారికంగా ఈ ఉదయం ప్రారంభమైంది.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 6వ తేదీ నుండి ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఆరు రోజుల పాటు పర్యటించనున్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ తూర్పు విభాగ కార్యదర్శి రుద్రేంద్ర టాండన్ ఆ పర్యటన వివరాలను న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులకు వెల్లడిస్తూ... జూలై 6 నుంచి 8 వరకు ప్రధానమంత్రి ఇండోనేషియాలో పర్యటిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటూ.. సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యం కలిగిన యోగ్యకర్త నగరాన్ని కూడా సందర్శిస్తారని చెప్పారు. 2025 గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో భారత్‌ను సందర్శించిన సందర్భంగా ప్రారంభమైన ద్వైపాక్షిక సహకార చర్చలకు ఈ పర్యటన కొనసాగింపుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మలక్కా జలసంధి సముద్ర ప్రాంత భద్రత, స్థిరత్వ పరిరక్షణలో ఇండోనేషియా ఎప్పటి నుంచో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ సముద్ర మార్గం భారతదేశానికి అత్యంత ముఖ్యమైన సముద్ర వాణిజ్య మార్గాల్లో ఒకటని, భారతదేశానికే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కూడా మలక్కా జలసంధి అత్యంత వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన ప్రాంతమని వివరించారు. ఇక పర్యటనలో రెండో దశగా జూలై

8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారని వెల్లడించారు. మూడు దేశాల పర్యటనలో చివరిగా జూలై 10, 11వ తేదీల్లో నరేంద్ర మోదీ న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారని టాండన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సింధు జలాల ఒప్పందంపై భారత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ న్యూఢిల్లీలో ఈరోజు వారాంతపు మీడియా సమావేశంలో మాట్లాడుతూ… సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తున్న మద్దతు నేపథ్యంలో సింధు జలాల ఒప్పందం రద్దు కొనసాగుతుందని చెప్పారు. ఉగ్రవాదానికి పాకిస్థాన్ తన మద్దతును శాశ్వతంగా విరమించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా బంగ్లాదేశ్‌లోని తీస్తా నది పునరుద్ధరణ ప్రాజెక్టు గురించి వివరణ ఇస్తూ.. బంగ్లాదేశ్‌లో భారత్ చేపడుతున్న అభివృద్ధి సహాయ కార్యక్రమాలు పరస్పర అంగీకారంతో రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా అమలవుతున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. తీస్తా నది ప్రాజెక్టుపై భారత అభిప్రాయాలను ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రభుత్వానికి తెలియజేశామని జైస్వాల్ స్పష్టం చేస్తూ…

(వాయిస్ 18 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ ఎగుమతులను ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక ట్రిలియన్ డాలర్లకు చేర్చే లక్ష్యంతో భారత్ వేగంగా ముందుకు సాగుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ లక్ష్యంలో భాగంగా వార్షిక ఎగుమతుల్లో దాదాపు 15 శాతం ఇప్పటికే తొలి త్రైమాసికంలోనే నమోదైనట్లు ఆయన వెల్లడించారు. న్యూఢిల్లీలో జరిగిన బోర్డ్ ఆఫ్ ట్రేడ్ సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ… వస్తు ఎగుమతులను సుమారు 440 బిలియన్ డాలర్ల నుంచి 530 బిలియన్ డాలర్లకు, సేవల ఎగుమతులను సుమారు 421 బిలియన్ డాలర్ల నుంచి 470 బిలియన్ డాలర్లకు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. తొలి త్రైమాసికంలో వస్తు ఎగుమతులు సుమారు 15 శాతం, సేవల ఎగుమతులు 10 నుంచి 11 శాతం వరకు వృద్ధి చెందాయని పేర్కొన్నారు. భారత ఎగుమతి వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తూ.. సమ్మిళిత అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని కేంద్రమంత్రి తెలిపారు. ప్రతి రాష్ట్రం, ప్రతి జిల్లా, ప్రతి రంగాన్ని సమాన ప్రాధాన్యంతో పరిగణిస్తూ ఎగుమతుల విస్తరణకు కార్యాచరణ రూపొందిస్తున్నామని పీయూష్ గోయల్ వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల అమలుపై చర్చించేందుకు రాష్ట్రాల పంచాయతీరాజ్ మంత్రుల జాతీయ సదస్సును న్యూఢిల్లీలో నిర్వహిస్తోంది. 16వ ఆర్థిక సంఘం గ్రామీణ స్థానిక సంస్థలకు 4 లక్షల 35 వేల 236 కోట్ల రూపాయల నిధులను సిఫార్సు చేసిందని ఆ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇవి 15వ ఆర్థిక సంఘం ఐదేళ్ల కాలానికి చేసిన కేటాయింపులతో పోలిస్తే సుమారు 84 శాతం అధికమని పేర్కొంది. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో ఆర్థికంగా బలోపేతమైన, డిజిటల్ సదుపాయాలతో కూడిన, జవాబుదారీతనం కలిగిన గ్రామ పంచాయతీలు సమ్మిళిత, సుస్థిర అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషిస్తాయని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ పాత్రికేయులతో మాట్లాడుతూ… 16వ ఆర్థిక సంఘం పంచాయతీలకు 80 శాతం ప్రాథమిక గ్రాంట్లు, 20 శాతం పనితీరు ఆధారిత గ్రాంట్లను ప్రతిపాదించినట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అమర్‌నాథ్ వార్షిక పవిత్ర యాత్ర అధికారికంగా ఈ ఉదయం ప్రారంభమైంది. నున్వాన్–పహల్‌గామ్, బాల్తాల్ మార్గాల ద్వారా యాత్రికులు సజావుగా పవిత్ర గుహ ఆలయం వైపు పయనమయ్యారు. తెల్లవారుజామునే బేస్ క్యాంపుల నుంచి బయలుదేరిన వేలాది మంది భక్తులు ఎత్తైన పర్వతాలు, ఇరుకైన మార్గాలను దాటుకుంటూ సహజసిద్ధంగా ఏర్పడే మంచు శివలింగాన్ని దర్శించేందుకు పవిత్ర అమర్‌నాథ్ గుహ ఆలయానికి చేరుకుంటున్నారని మా ఆకాశవాణి ప్రతినిధి తెలియజేశారు. యాత్రికుల సౌకర్యం, భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు మార్గాల్లోనూ తాగునీరు, ఆహారం, విశ్రాంతి కేంద్రాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలను అధికారులు ఏర్పాటు చేశారని వెల్లడించారు. ఈ ఉదయం అధికారులు యాత్రికులకు పలు కీలక సూచనలు చేశారు. నమోదు చేసుకున్న తేదీల్లోనే యాత్రకు రావాలని కోరుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి రోజు అనుమతించే యాత్రికుల సంఖ్యకు పరిమితి విధించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ రోజు తెల్లవారుజామున జమ్మూ నుంచి బయలుదేరిన రెండో విడత యాత్రికులు కశ్మీర్‌కు చేరుకోగా, వారు రేపు ఉదయం పవిత్ర గుహ ఆలయం వైపు ప్రయాణం ప్రారంభించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్, గోవా, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, విదర్భ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రేపటి వరకు ఉత్తరప్రదేశ్, బీహార్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, జమ్మూ-కాశ్మీర్, లడఖ్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం కొనసాగుతోందని దీని ప్రభావంతో రానున్న నాలుగు నుంచి ఐదు రోజుల పాటు మధ్య భారతదేశంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతాయని పేర్కొంది. ఇక నైరుతి రుతుపవనాలు గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని మిగిలిన ప్రాంతాల్లోకి మరింతగా విస్తరించాయని ఐఎండీ శాస్త్రవేత్త ఎ. ధర్మ రాజు వెల్లడిస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో రేపు పర్యటించనున్నారు. ముందుగా రాజస్థాన్ లో పర్యటించి జోధ్‌పూర్ విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించనున్నారు. సుమారు 480 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ద్వారా ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందుబాటులోకి రానున్నాయి. జోధ్‌పూర్‌లో సవరించిన ఉడాన్ పథకాన్ని కూడా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. అదే విధంగా రాజస్థాన్‌లోని బాలోత్రాలో సుమారు లక్షా 6 వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపనలు చేయడంతో పాటు కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =